
# నీరజ్ నయా చరిత్ర

**90.23 మీటర్లతో సరికొత్త రికార్డు**


**91.06 మీటర్లతో చోప్రాను దాటేసిన వెబర్**



దోహా: భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా కొత్త చరిత్ర లిఖించాడు. జావెలిన్‌త్రోలో తనకంటూ ప్రత్యేకతను నిలుపుకుంటూ సరికొత్త రికార్డుతో నీరజ్ కదంతొక్కాడు. శుక్రవారం దోహా వేదికగా మొదలైన ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్‌లో నీరజ్ తొలిసారి 90.23 మీటర్ల మార్క్ అందుకుని ఔరా అనిపించాడు. గత కొన్నేండ్లుగా ఊరిస్తూ వస్తున్న 90 మీటర్ల దూరాన్ని తన మూడో ప్రయత్నంలో సాధించాడు. ఈ క్రమంలో గతంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు(89.94మీ)ను చోప్రా బద్దలు కొట్టాడు. పోటీలో తన మొదటి ప్రయత్నంలోనే 88.44మీటర్ల మార్క్ అందుకున్న ఈ స్టార్ అథ్లెట్..రెండో ప్రయత్నంలో ఫౌల్ అయ్యాడు. అయితే మూడో ప్రయత్నంలో తన బలాన్నంతటినీ కూడదీసుకుంటూ ఇన్నాళ్లుగా అందినట్లే అంది దూరమవుతున్న 90మీటర్ల దూరాన్ని ఒడిసిపట్టుకున్నాడు. అదే జోరును కొనసాగించడంలో చోప్రా ఒకింత విఫలమయ్యాడు. నాలుగో ప్రయత్నంలో 80.56మీటర్లు విసిరిన నీరజ్ ఐదోసారి ఫౌల్ అయ్యాడు. ఆఖరిదైన ఆరో త్రోలో నీరజ్ 88.20మీటర్లకు పరిమితమయ్యాడు. ఇదే అదనుగా అప్పటి వరకు చోప్రా దరిదాపుల్లో ఉన్న జులియన్ వెబర్ ఆరో ప్రయత్నంలో ఏకంగా 91.06మీటర్లు విసిరి అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. కెరీర్‌లో తొలిసారి అత్యుత్తమ మార్క్ అందుకున్న వెబర్..నీరజ్‌ను రెండో స్థానానికి పరిమితం చేయగా, అండర్సన్ పీటర్స్(85.64మీ)మూడో స్థానంలో నిలిచాడు.

# చెస్ ప్రపంచకప్‌లో రిత్విక్

• **భారత్ నుంచి ఏడుగురు ఎంపిక**



యూఏఈ: ప్రతిష్ఠాత్మక చెస్ ప్రపంచకప్ టోర్నీకి భారత యువ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఆఖర్లో జరుగనున్న ఈ మెగాటోర్నీలో భారత్ తరఫున రిత్విక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. అల్ ఐన్(యూఏఈ) వేదికగా ముగిసిన ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంలో నిలువడం ద్వారా రిత్విక్..చెస్ ప్రపంచకప్ బెర్తు దక్కించుకున్నాడు. శుక్రవారంతో ముగిసిన టోర్నీలో టాప్-10లో నిలిచిన ప్లేయర్లు నేరుగా ఈ మెగాటోర్నీకి అర్హత సాధిస్తారు. 33వ సీడ్‌గా బరిలోకి దిగిన రిత్విక్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. మొత్తం తొమ్మిది రౌండ్ల పాటు జరిగిన టోర్నీలో ఈ యువ జీఎం 6.5 పాయింట్లు దక్కించుకున్నాడు. 33 దేశాలకు చెందిన 154 మంది టాప్ ప్లేయర్లు ఈ టోర్నీలో పోటీపడ్డారు. భారత్, జపాన్, చైనా, మలేషియా, ఖతార్, సింగపూర్ లాంటి దేశాల ప్లేయర్లు గట్టిపోటీనిచ్చారు. చెస్ ప్రపంచకప్‌లో భారత్ నుంచి రిత్విక్‌తో పాటు నిహాల్ సరీన్, ఇనియాన్, నారాయణన్, ప్రణేశ్, హర్షవర్ధన్, కార్తికేయన్ మురళీ ఉన్నారు.

# ఈశ్వరన్ సారథ్యంలో..

**ఇంగ్లండ్ పర్యటనకు ఇండియా 'ఏ' జట్టు ప్రకటన**

**ఇషాన్ కిషన్‌కు చోటు • కరుణ్ నాయర్‌కు పిలుపు**



ఢిల్లీ: త్వరలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత 'ఏ' జట్టును బీసీసీఐ ప్రకటించింది. దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న అభిమన్యు ఈశ్వరన్ సారథ్యంలో 18 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ అతడికి డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. గతేడాది బీసీసీఐ క్రమశిక్షణ చర్యలతో సెంట్రల్ కాంట్రాక్టుతో పాటు జట్టులో చోటు కోల్పోయిన ఇషాన్ కిషన్.. ఆశ్చర్యకరంగా 'ఏ' జట్టుకు ఎంపికయ్యాడు. దేశవాళీలో సంచలన ప్రదర్శనలు చేసిన కరుణ్ నాయర్ సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి వచ్చాడు. 33 ఏండ్ల నాయర్.. 'ఏ' జట్టులో రాణిస్తే ప్రధాన జట్టులోనూ ఆడే అవకాశాలు మెరుగవుతాయి. ఇక టీమ్‌ఇండియా రెగ్యులర్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, రుతురాజ్, నితీశ్ కుమార్ రెడ్డి వంటి స్టార్ క్రికెటర్లూ జట్టులో ఉన్నారు. కాగా ఇటీవల కాలంలో వన్డేలు, టీ20లలో నిలకడగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్ సైతం 'ఏ' జట్టులో ఉంటాడని ఆశించినా అతడికి నిరాశే ఎదురైంది. ఈశ్వరన్ సారథ్యంలోని భారత జట్టు.. ఇంగ్లండ్ లయన్స్‌తో మే 30న తొలి టెస్టు, జూన్ 6న రెండో టెస్టు ఆడనుంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత భారత టెస్టు జట్టు పగ్గాలు అందుకుంటాడని భావిస్తున్న శుభ్‌మన్ గిల్‌తో పాటు యువ బ్యాటర్ సాయి సుదర్శన్ రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నారు.

## త్వరలో పీకేఎల్ వేలం

ముంబై: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 12వ సీజన్ వేలం పాటకు వేళయైంది. ఈనెల 31, జూన్ 1 తేదీల్లో ముంబై వేదికగా లీగ్ వేలం జరుగనుంది. ఈ మధ్యే ముగిసిన పీకేఎల్ 11వ సీజన్‌లో హర్యానా స్టీలర్స్ తొలిసారి టైటిల్ విజేతగా నిలిచింది. ఈ నేపథ్యంలో రానున్న సీజన్‌కు మరిన్ని మెరుగులు అద్దే క్రమంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఈనెల 31 నుంచి యూటీటీ

న్యూఢిల్లీ: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) లీగ్ ఆరో సీజన్‌కు వేళయైంది. అహ్మదాబాద్ వేదికగా ఈనెల 31 నుంచి లీగ్ మొదలుకాబోతున్నది. పోటీల తొలి రోజు డబుల్ హెడర్‌తో లీగ్‌కు తెరలేవనుంది. సీజన్-2 విన్నర్ దబాంగ్ ఢిల్లీ, జైపూర్ ప్యాట్రియాట్స్ మధ్య తొలి మ్యాచ్ జరుగనుండగా, డిఫెండింగ్ చాంపియన్ డెంపో గోవా చాలెంజర్స్, అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్ మరో పోరులో తలపడనున్నాయి. ఈసారి కోల్‌కతా థండర్‌బ్లేడ్స్ చేరికతో లీగ్‌లో ఫ్రాంచైజీల సంఖ్య ఎనిమిదికి చేరింది.

## ఫైనల్‌కు అల్కరాజ్, గాఫ్

రోమ్: ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జరుగుతున్న ఇటాలియన్ ఓపెన్‌లో అగ్రశ్రేణి ప్లేయర్లు కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్), కోకో గాఫ్ (అమెరికా) ఫైనల్‌కు దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో మూడో సీడ్ అల్కరాజ్ 6-3, 7-6 (7/4)తో ముసెట్టి (ఇటలీ)ని చిత్తుచేసి ఫైనల్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో గాఫ్ 7-6 (7/3), 4-6, 7-6 (7/4)తో కిన్వెన్ జెంగ్ (చైనా)ను మట్టికరిపించింది. ఫైనల్‌లో గాఫ్..జాస్మిన్ పవులిని(ఇటలీ)తో తలపడనుంది.



# ఫిర్ షురూ

**నేటి నుంచి ఐపీఎల్ పునఃప్రారంభం • ఆరు వేదికల్లో 13 లీగ్ మ్యాచ్‌లు**

**బెంగళూరు, కోల్‌కతా పోరుతో రీస్టార్ట్ • అందరి కండ్లూ విరాట్ కోహ్లీపైనే..**



బెంగళూరు: భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా వారం రోజుల పాటు వాయిదాపడ్డ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్.. శనివారం నుంచి పునఃప్రారంభం కానుంది. పునరుద్ధరించిన షెడ్యూల్ ప్రకారం ఆరు వేదికల్లో మిగిలిన 13 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించేందుకు బీసీసీఐ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. బెంగళూరు, జైపూర్, ఢిల్లీ, లక్నో, ముంబై, అహ్మదాబాద్‌లలో మ్యాచ్‌లు జరుగుతాయి. యాధృశ్చికమో ఏమో గానీ ఈ సీజన్ ఆరంభ మ్యాచ్ మాదిరిగానే రీస్టార్ట్ మ్యాచ్ సైతం డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మధ్యే జరుగనుండటం విశేషం. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యమివ్వనున్న ఈ పోరుకు వర్షం ముప్పు పొంచి ఉండటం అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నది. గత రెండు రోజులుగా బెంగళూరులో వర్షాలు కురుస్తుండటం గమనార్హం. ఇక ఈనెల 27న లక్నో, బెంగళూరు మ్యాచ్‌తో లీగ్ దశ ముగియనున్న ఈ టోర్నీలో ప్లేఆఫ్స్‌నకు సంబంధించిన వేదికలను బీసీసీఐ త్వరలోనే ప్రకటించనుంది. మే 29న క్వాలిఫయర్ 1, 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫయర్ 2 జరుగనుండగా జూన్ 3న ఫైనల్‌ను నిర్వహించనున్నారు. పునరుద్ధరణ తర్వాత జరుగబోయే మ్యాచ్‌లలో చీర్ లీడర్స్, డీజేలు లేకుండా టోర్నీని జరిపించనున్నట్టు వార్తలు వచ్చినా దానిపై బీసీసీఐ మాత్రం అధికారికంగా స్పందించలేదు. పాత షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో మరో మ్యాచ్ ఆడాల్సి ఉన్నప్పటికీ కొత్త షెడ్యూల్‌లో ఆ మ్యాచ్‌ను ఢిల్లీలో ఆడించనుండటం సన్‌రైజర్స్ అభిమానులకు నిరాశను కలిగించేదే!

### ఎక్కడ ఆగామంటే..!

పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ధర్మశాల వేదికగా మే 8న జరగాల్సిన మ్యాచ్ అర్ధాంతరంగా (ఒక ఇన్నింగ్స్‌లో 10.1 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది) ఆగి.. ఈ సీజన్ వాయిదాపడే సమయానికే మాజీ చాంపియన్లు చెన్నై సూపర్ కింగ్స్, సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా నిష్క్రమించాయి. గుజరాత్ టైటాన్స్, ఆర్‌సీబీ తలా 16 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాయి. పంజాబ్ (15), ముంబై (14), ఢిల్లీ 13 పాయింట్లతో రేసులో నిలిచాయి. అధికారికంగా నిష్క్రమించకపోయినా కోల్‌కతా, లక్నో.. ఎలిమినేషన్‌కు ఒక్క మ్యాచ్ దూరంలో ఉన్నాయి. ఇక మరో మ్యాచ్ గెలిస్తే గుజరాత్, బెంగళూరు.. ప్లేఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకుంటాయి.శనివారం కేకేఆర్‌తో పోరులో బెంగళూరు గనక విజయం సాధిస్తే 18 పాయింట్లతో ఈ సీజన్‌లో ప్లేఆఫ్స్ చేరిన తొలి జట్టుగా ఆర్‌సీబీ నిలుస్తుంది. పంజాబ్, ఢిల్లీకి తలా మరో మూడు మ్యాచ్‌లు మిగిలుండగా 14 పాయింట్లతో ఉన్న ముంబై రెండు మ్యాచ్‌లే ఉన్నాయి. ఈ రెండింటిలో ఒక్కటి ఓడినా హార్దిక్ సేన ప్లేఆఫ్స్ ఆశలు వదులుకోవాల్సిందే. ధర్మశాలలో ఆగిన పంజాబ్, ఢిల్లీ మ్యాచ్‌ను మళ్లీ మొదట్నుంచి ఆడించనున్నారు. ముంబై ఓ మ్యాచ్‌లో ఓడి మిగిలిన మూడు మ్యాచ్‌లలో గనక పంజాబ్, ఢిల్లీ తలా రెండు గెలిస్తే ప్లేఆఫ్స్ రేసు మరింత రసవత్తరమవనుంది.

### అందరి చూపు కోహ్లీ వైపే..

ఐపీఎల్ రీస్టార్ట్ తర్వాత జరుగబోయే కేకేఆర్, బెంగళూరు పోరులో అందరి కండ్లూ రన్ మెషిన్ విరాట్ కోహ్లీ మీదే ఉన్నాయి. ఇటీవలే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ.. ఆ ప్రకటన తర్వాత ఆడనున్న తొలి మ్యాచ్ ఇదే కావడంతో అతడితో పాటు బెంగళూరు అభిమానులకు ఈ పోరు ఎంతో ప్రత్యేకం కానుంది. కోహ్లీకి ట్రిబ్యూట్‌గా ఆర్‌సీబీ అభిమానులంతా వైట్ టీషర్ట్స్‌లో రానున్నారు. చిన్నస్వామి శ్వేత వర్ణం పులుముకోనుంది.

**ఆరెంజ్ క్యాప్:**
**సూర్యకుమార్ యాదవ్**
(12 ఇన్నింగ్స్‌లలో 510 పరుగులు)
**పర్పుల్ క్యాప్:**
**ప్రసిద్ధ్ కృష్ణ**
(11 మ్యాచ్‌లలో 20 వికెట్లు)

## స్టార్క్ ఔట్!




ప్లేఆఫ్స్ రేసులో ఉన్న ఢిల్లీకి కీలక మ్యాచ్‌ల ముందు ఎదురుదెబ్బ. ఆ జట్టు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ భారత్‌కు తిరిగిరాలేనంటూ క్యాపిటల్స్ యాజమన్యానికి లేఖ రాసినట్టు తెలుస్తున్నది. స్టార్క్ లేకపోవడం ఢిల్లీ బౌలింగ్ విభాగానికి తీరని లోటు. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌లు ఆడిన స్టార్క్ 14 వికెట్లు పడగొట్టాడు. అతడి స్థానంలో మరో ఆటగాడిని క్యాపిటల్స్ ఇంకా భర్తీ చేయలేదు. ఓపెనర్ డుప్లెసిస్ రాకపైనా స్పష్టత లేదు. కాగా జేక్ ఫ్రేసర్ మెక్‌గర్క్ స్థానాన్ని భర్తీ చేయనున్న బంగ్లా పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌కు ఆ దేశ క్రికెట్ బోర్డు ఎన్‌వోసీ అందజేసింది.

## వాంఖడేలో రోహిత్ స్టాండ్



టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ పేరిట చారిత్రక వాంఖడే స్టేడియంలో కొత్త స్టాండ్ కొలువు దీరింది. దేశ క్రికెట్‌కు రోహిత్ చేసిన సేవలకు గుర్తింపుగా ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) శుక్రవారం రోహిత్ స్టాండ్‌ను ఆవిష్కరించింది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు ఎన్‌సీపీ అధినేత శరద్‌పవార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రోహిత్ కుటుంబ సభ్యులకు తోడు ముంబై ఇండియన్స్ ప్లేయర్ల సమక్షంలో స్టాండ్‌ను సీఎం ఫడ్నవీస్ ఆవిష్కరించారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.